# చలి పులి

● దట్టంగా కమ్ముకుంటున్న పొగమంచు ● ఉన్ని దుస్తులకు గిరాకీ ● ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి విక్రయాలు

రామాయంపేట, డిసెంబర్ 2: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో చలి తీవ్రత ఎక్కువై పొగ మంచు పల్లెలను కమ్మేస్తోంది. వారం రోజులుగా పొగమంచు మూలంగా రామాయంపేట, నిజాంపేట మండలాల్లో చుట్టు పక్కల ఉన్న గ్రామాలన్నింటినీ ఈ పొగమంచు కమ్మేస్తున్నది. అర్ధరాత్రి నుంచే మొదలవుతున్న ఈ పొగమంచు ఉదయం 7 గంటలు దాటి సూరీడు ప్రత్యక్షమైనా గ్రామాలు కన్పించడం లేదు. పొగమంచు మూలంగా చలి తీవ్రత ఎక్కువై వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు పంట పొలాల్లోకి వెళ్లలేక ఆరు బయటే మంటలు కాచుకుంటున్నారు. గ్రామాల్లో ఉదయం తీవ్రమైన చలి ఉండటంతో చిన్నారులు, పెద్దలు సైతం మంటలు కాచు కుంటున్నారు. ఇక పొగమంచు మూలంగా ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలకు దారి కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు.

చలికాలం మూలంగా ప్రజలు వణికిపోతూ పొద్దంతా స్వెటర్లు వేసుకొనే ఉంటున్నారు. రామాయంపేట పట్టణంలో ఉన్న దుకాణాదారులకు స్వెట్టర్ల విక్రయాలు పెరుగుతు



నిజాంపేటలో మంట కాచుకుంటున్న దృశ్యం

న్నాయి. ఈ సారి వర్షాలు రెండు మండలాలలో సమృద్ధిగా కురవడం చెరువులు, కుంటలన్నీ నిండు గా ఉన్నాయి. దీంతో గతంలో ఎప్పుడూ లేనంతగా చలి తీవ్రత ఎక్కువగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. సూర్యోదయం ఉదయం 7 గంటల వర కు వచ్చినా కూడా బయట పొగ



నస్కల్, రాంపూర్ రోడ్డును కమ్మేసిన పొగమంచు

మంచు మూలంగా ఏమీ కనపడడం లేదు. దీంతో చలి వణకుతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం లేచి కల్లాపు చల్లే మహిళలు సైతం పొగమంచు భయానికి నిద్రలేవకుండా ఇండ్లల్లోనే ఉండిపోతున్నారు. చలికి తట్టుకోలేక వృద్ధులు తమ ఇండ్లల్లోని మంచాలకే పరిమితమవుతున్నారు. మరోవైపు ఆరోగ్యంగా ఉన్నవారు కూడా చలితీవ్రతతో వణుకు మూలంగా జ్వరాలు, దగ్గు, జలుబు, కాళ్లనొప్పులతో దవాఖానల చుట్టూరా తిరుగుతున్నారు. గత మూడు దశాబ్దాల క్రితం ఉన్న చలిని మళ్లీ ఈ ఏడాది చూస్తున్నామని గ్రామాల్లోని వృద్ధులు, గొర్ల, పశువుల కాపర్లు అంటున్నారు. చలి ఎక్కువగా ఉండడంతో రామాయంపేటలో వెలిసిన స్వెట్టర్ల దుకాణాలు వ్యాపారం జోరుగా కొనసాగుతున్నది.

### గింత సలిని ఎప్పుడూ సూడలేదు



సలిబాగా పెడ్తున్నది. గింత సలిని ఎప్పుడూ చూడలేదు. పొద్దుగల్ల లేవంగనే ఎండపొద్దుకే కూసుంటున్నం. పది గంటలైనా సలి తక్కువైతలేదు. గీ సలి గిట్లనే ఉంటే ఎట్ల బతుకుతమో ఏమో. రాత్రి పండుకునేటప్పుడు కూడా ఎన్ని దుప్పట్లు కప్పుకున్నా సలి పోతలేదు. ఈ సారి ఎన్నడూలేనంతగా వర్షాలు పడడంతో సలిబాగానే ఉంది. ఈ సలి మూలంగా ఎవుసం పనులకు పోలేకపోతున్నం.

– గొడిసెల రాజు, కోనాపూర్, రామాయంపేట

### పొద్దంతా ఎండలనే ఉంటున్నం



సలి మూలంగా పొద్దంతా ఎండలోనే ఉంటున్నం. పొద్దుగల్లనే జీవాలను తీసుకుని అడివిలోనే ఉండే మాకు పొగ మంచుతో శానా ఇబ్బందులు పడ్తున్నం. పది దాటి నా మంచు కురుస్తూనే ఉంటంది. మేము అన్నం తిన్నా నీల్లుతాగినా మాకు ఎండతోనే పొద్దుగడుస్తుంది.

గొర్లకాపర్లు కిష్టయ్య, యాదగిరి, రాయిలాపూర్

### కాళ్లు, షేతులు వంకర్లు పోతున్నయ్



గిపారి సలి శానా ఉంది. సలితోటి ఎవుసం పనులకు పోవలంటనే శానా గుబులైతాంది. ఒకేల పనులకు పోయినా అక్కడ కొద్దిసేపు మంటలు కాచుకునే పనిలోకి వెళ్తున్నం. సలిబాగా ఉండడంతో ఎవుసం పనులు కూడా సరిగ్గా సాగుతలేవ్. కూలీలు కూడా దొరుకుతలేరు. సొంతంగానే ఎవుసం పనులను జేసుకుంటున్నం. దినాం.. నీల్లలోనే ఉంటుంటే.. కాళ్లు, షేతులు వంకర్లు పోతున్నయ్.

– ఎడ్ల మల్లారెడ్డి, నందిగామ

### తెలంగాణలో వ్యాపారం బాగుంది



మాది మధ్యప్రదేశ్ అమ యాని, తెలంగాణ రాష్ట్రంలో వ్యాపారం బాగుంటుందని తెలిసి, ప్రతి ఏడాది చలి సీజన్‌లో తెలంగాణకు వచ్చి వచ్చి రగ్గులు, స్వెట్టర్లు, దుప్పట్లు తదితర వెచ్చటి దుస్తులను అమ్ముతాం. మా ఇంటి దగ్గరికంటే తెలంగాణ రాష్ట్రంలోనే బాగుంది. విక్రయాలు కూడా ఈ రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నాయి. వ్యాపారం మంచిగుంది.

– శ్యాంలాల్, స్వెటర్ల వ్యాపారి

### ఇక్కడి ప్రజలా మర్యాద బాగుంది



ఇక్కడి ప్రజల మంచి మర్యాదస్తులు. మాకు ఇక్కడి ఎలాంటి ఇబ్బందులు లేవు. మాకు మంచిగ సహకరించి వ్యాపారాలు మంచిగ చేసుకోవాలని చెప్తారు. ఇక్కడ ఉన్నంత మర్యాద మేము ఏ రాష్ట్రంలో కూడా చూడలేదు. చలికాలం సీజన్‌లో రెండు నెలల పాటు ఇక్కడే ఉండి వ్యాపారం చేసుకుంటాం. వ్యాపారం చాలా బాగుంది.

– యువరాజ్, వ్యాపారి, రాజస్థాన్

---

బీఆర్ఎస్ గెలువాలని బెజవాడ అమ్మవారికి

## ఎంపీపీ, పాలక వర్గం మొక్కులు



బెజవాడ అమ్మవారి సన్నిధిలో చేగుంట ఎంపీపీ శ్రీనివాస్, పాలక వర్గం

చేగుంట, డిసెంబర్2: బీఆర్ఎస్ పార్టీ మూడవ సారి అధికారంలోకి రావాలని, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువాలని కోరుతూ చేగుంట చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, పాలక వర్గం సభ్యులు, ఎంపీటీసీలు శనివారం విజయవాడ అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బింగి గణేశ్, హోళియనాయక్, నవీన్, గాండ్ల లతానంధం తదితరులున్నారు.

## పరిశ్రమను తెరిపించాలని కార్మికుల ఆందోళన

చేగుంట, డిసెంబర్2: పెండింగ్ వేతనాలతోపాటు బోనస్ చెల్లించకుండ పరిశ్రమను అక్రమంగా యాజమాన్యం లాకౌట్ చేయాడిని నిరసిస్తూ పరిశ్రమ వద్ద కార్మికులుకు ఆందోళనకు దిగిన ఘటన చేగుంట మండలంలోని మక్కరాజిపేటలో శనివారం జరిగింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమను గత మూడేళ్లుగా మక్కరాజిపేటలో రైస్‌మిల్‌లో నడుపుతూ నాలుగు రోజుల క్రితం స్ట్రాంటియం ఫెర్రిటిన్ పరిశ్రమను అక్రమంగా మూసివేసిందని ఆరోపించారు. 2020 డిసెంబర్ వరకు మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ శివారులో నడిపి అక్కడి నుంచి పరిశ్రమ స్థలం అమ్మివేసిన సందర్భంగా వేతన ఒప్పందం చేసి, చేగుంట మండలంలో పరిశ్రమను కొనసాగిస్తామని పరిశ్రమ ఎండీ, మరో డైరెక్టర్ రాత పూర్వక ఒప్పందం చేశారన్నారు. ఈ విషయమై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సంగారెడ్డి వారి దృష్టికి తీసుకువెళ్లగా.. అక్క



స్ట్రాంటియం ఫెర్రిటిన్ పరిశ్రమ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

డికి హాజరు కాకుండా చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్మికులను మోసం ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ కార్మికులు బలేశ్, యాదగిరి, లక్ష్మణ్, వెంకట్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

---

## బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

● రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నర్సారెడ్డి



మాట్లాడుతున్న రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నర్సారెడ్డి

రామాయంపేట రూరల్, డిసెంబర్2: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతున్నదని రామాయంపేట రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు బానప్పగారి నర్సారెడ్డి, ఝాన్సీలింగాపూర్ గ్రామ రైతు బంధు సమితి అధ్యక్షుడు చాకలి పోచయ్య అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఏ పార్టీని కూడా ఇంతగా ఆదరించలేదని, అందుకే రెండు సార్లు అధికారంలోకి వచ్చేలా చేశారన్నారు. ఇప్పుడు కూడా ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ తప్పుడు సర్వేలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు.

## విద్యార్థినులకు కరాటే శిక్షణ

రామాయంపేట రూరల్, డిసెంబర్2: రామాయంపేట మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థినులు కరాటే నేర్చుకుంటున్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆత్మరక్షణలో కూడా ముందుండాలని అనుభవజ్ఞులైన కరాటే మాస్టర్లతో ప్రభుత్వం విద్యార్థినులకు శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆత్మరక్షణ విద్య వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉంటారని, దీంతో చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. భవిష్యత్‌లో కూడా కరాటే విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు

ఈ నెలాఖరు వరకూ

## పోలీస్ యాక్ట్ అమలు

● శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరంగా చర్యలు

● ప్రజలంతా స్నేహ భావంతో ఉండాలి: ఎస్ఐ రాజయ్య

రేగోడ్, డిసెంబర్ 2: ఈనెలాఖరు వరకూ మండల వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాని రేగోడ్ ఎస్ఐ రాజయ్య హెచ్చరించారు. శనివారం విలేకరుల సమావేశంలో ఎస్ఐ రాజయ్య మాట్లాడుతూ..ప్రతి రోజు తేదీలు, సంవత్సరాలు మారుతాయని, పండగలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయని అలాగే ఎలక్షన్‌లు కూడా అన్నారు. ఓటు మన హక్కు, ఆ హక్కును వినియోగించుకోవాలి అంతవరకే పరిమితం కావాలన్నారు. ఎవరికి నచ్చినోళ్లకు వారికి ఓటు వేశారని, ఇది నాపార్టీ, అది నీ పార్టీ అని విభేదం లేకుండా నచ్చిన నాయకునికి ఓటు వేసి తర్వాత కలిసి ఉండటమే మన బాధ్యతని సూచించారు. ప్రజలంతా స్నేహ భావంతో ఉండాలి. ఇది నా పార్టీ, నా నాయకుడు అని ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు పెట్టి చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.